తొల్లూరు నాగేశ్వరరావు

# ఆధునిక నీతి కథలు

ఆ నియోజకవర్గంలో సిద్దయ్య మూడుసార్లునుంచీ ఎం.ఎల్.ఏ.గా నెగ్గుతున్నాడు. అయితే ఓట్ల ఆధిక్యతలో రానురాను క్షీణత కనబడుతోంది. మొదటిసారి పదమూడువేల నాలుగొందల ముప్పైమూడు ఓట్లతో గెల్చాడు. రెండోసారి ఏడువేల ఆరొందల నాలుగు ఓట్లతో నెగ్గాడు. మూడోసారి మూడువేల నూట ఇరవై తొమ్మిది ఓట్లతో పదవి దక్కించుకున్నాడు. అయితే ఎన్నికల ఖర్చులు మాత్రం తడవతడవకూ తడిసి మోపెడయ్యాయి. మొదటిసారి యాభైవేలైతే, రెండోసారి లక్ష తొంభైవేలైతే, మూడోసారి మూడులక్షల ముప్పైఆరువేలు అయ్యాయి. కాలంకొద్దీ ఖర్చు పెరిగినా, మిగులుబాటులో తరుగులేదు. ఎలక్షన్ ప్రచారంకోసం మొదటిసారిగా చందాల రూపంలో డెబ్బైఅయిదు వేలొచ్చింది; రెండోసారి రెండులక్షల ఎనభైవేలు వసూలైంది; మూడోసారి పార్టీవాళ్ళు ఇచ్చిన దాంతో సహా నాలుగులక్షల నలభైవేలు ముట్టింది. మూడుసార్లూనుంచీ సిద్దయ్యపార్టీయే అధికారంలో వుంది. అయితే సిద్దయ్య ఎం.ఎల్.ఏ గానే ఉండిపోయాడు. పెద్ద మంత్రి గానీ, చిన్న మంత్రి గానీ కాలేకపోయాడు. కొనకు రెడీమేడ్ గార్మెంట్స్ కార్పొరేషన్‌కు కూడా చైర్మన్ కుర్చీ ఎక్కలేకపోయాడు. అందుకు సిద్దయ్య ఎప్పుడూ ప్రయత్నించలేదు. 'పైరవీ'యే ప్రాణంగా పాకులాడలేదు. ఆయన రాజకీయ సిద్ధాంత రహస్యం — పదవుల్లోవుండి పదిమందికీ కనబడేట్టు పదిరాళ్లు సంపాయించుకోవడం కాదు; పదవుల్లో లేకుండానే నీటిలో వున్న చేప నీరుతాగినట్టు పబ్లిసిటీ లేకుండా లక్షలకు లక్షలు వెనకవేయడం. ఈ సిద్ధాంతానికి తాళికట్టిన సిద్దయ్య మొత్తంమీద మూడుసార్ల ఎం.ఎల్.ఏ. కాలాల్లో యాభైలక్షలదాకా స్థిర, చరాస్తుల్ని పోగుచేశాడు— అరచేతులకు రవ్వంత అయిల్ కాకుండా.

మళ్ళీ ఎలక్షన్ టైమొచ్చింది.

అసెంబ్లీ ఎన్నికలకు తేదీని ప్రకటించారు.

వారం రోజులపాటు తెల్లటి ఎంబాసిడర్ కారులో నియోజకవర్గంలోని

ముఖ్యమైన వూళ్ళన్నీ ఓసారి పర్యటించి వచ్చారు సిద్ధయ్య.

"ఏం సిద్ధయ్యగారూ! మళ్ళీ మా నియోజకవర్గంలో మీరేగా నిలబడేది!" అన్నాడు ఓ వూరి మున్సబు.

"నేనా! ఈ రాజకీయాల రొంపిలో ఈ సారి నేను దిగదల్చుకోలేదు. మూడుసార్లు చేశాను ఎం.ఎల్.ఏ షిప్. ఈ జన్మకు ఈ ప్రజాసేవ చాలు. మీబోటి పెద్దలు నిలబడితే...."

రెల్లుగడ్డి లాంటి మీసాలు రెపరెపలాడేట్టు నవ్వి, "మాబోటి వాళ్ళకు ఓట్లెవరిస్తారు! మళ్ళీ మీరే నిలబడితే సునాయాసంగా గెలుస్తారు" అన్నాడు మున్సబు.

సిద్ధయ్య చిన్మయానందంగా చిరునవ్వు నవ్వుకున్నాడు.

"మావూరి షావుకారుగారబ్బాయి ఈ సారి ఎం.ఎల్.ఏ.గా నిలబడాలని ఉబలాటపడుతున్నాడు. వారంరోజులక్రితం హైదరాబాద్ వెళ్ళి ఇంకా రాలేదు. సీటుకోసం పాతాళహోమం చేస్తున్నాడట!" అన్నాడు మరో వూర్లో కరణంగారు.

"మంచిదేగా కరణంగారూ! యువకులు ముందుకొస్తే దేశం మరింత వేగంగా ముందుకుపోతుంది. నాబోటివాళ్ళు ఈదురుగాలికి తప్పుకోవడం మేలు" అన్నాడు సిద్ధయ్య.

"అలాగనకండి స్వామీ! రాజకియాల్లో మీబోటి తలలు నెరిసిన వాళ్ళుంటేనే ప్రభుత్వం స్థిరంగా వుంటుంది. ఈసారి కూడా మీరు నిలబడితే మా వూరి వోట్లన్నీ మీకే సాలిడ్‌గా పడతాయి."

కరణంగారి మాటలకు సిద్ధయ్య కడుపులో అరకోడి మాంసం హరాయింపు అయినట్టుగా సంతృప్తిగా నవ్వాడు.

"నాలుగో టరమ్ కూడా సిద్ధయ్యగారు ఈ నియోజకవర్గంలో నిలబడాల్సిందే. డప్పుమీద దెబ్బకొట్టి గెలవాల్సిందే!" అన్నాడు మరింకో వూళ్లో ఓ హరిజన నాయకుడు.

"అదేంటి పిచ్చయ్యా! ఈసారి మీబోటి హరిజన నాయకులకు ఛాన్సు ఇద్దామనుకుంటున్నా...."

"మా అటువంటి గంజినీళ్ళగాళ్ళకు ఆ పదవులెందుకు బాబయ్యా! ఈసారి మీరు మంత్రి గావాలి."

"నాకు ప్రజాసేవ తప్ప పదవులమీద ఆశలేదు పిచ్చయ్యా! మంత్రి కాదల్చుకుంటే ఎప్పుడో అయ్యేవాడ్ని. పార్టీకి విధేయుడుగా ఉండడం ప్రధానంగాని, పదవులు కాదు" అన్నాడు పిచ్చయ్య చిద్విలాసంగా చిరునవ్వు నవ్వుతూ

ఆ విధంగా సిద్ధయ్య ఎన్నో గ్రామాలు తిరిగి ఎంతోమంది పెద్దల్ని కల్సుకున్నాడు. అందరితోనూ ముందుగా తాను ఈసారి ఎం.ఎల్.ఏ.గా నిలబడదలేదని విన్నవించుకున్నాడు. అవతలివాళ్ల 'మీరే తప్పకుండా నిలబడాలి. మీరు తేనే గెలుస్తారు' అనేట్లు చెప్పించుకున్నాడు.

ఒకరోజు ఉదయం ఆ వూరి యువజననాయకుడు దేశోద్ధారకమూర్తి సిద్ధయ్య దగ్గరికొచ్చాడు.

"బాబాయ్! ఈసారి నేను ఎం.ఎల్.ఏగా పార్టీకి దరఖాస్తు పెట్టుకున్నాను. మీరు నిలబడడంలేదని తెల్సి."

"మంచిది బాబూ! పార్టీ నిన్ను సెలక్టుచేస్తే అంతకంటె నాకు సంతోషమేముంది? తప్పకుండా నేను సపోర్టు చేస్తాను" అన్నాడు సిద్ధయ్య అరువు తెచ్చుకున్న చిరునవ్వుతో.

పట్టరాని ఆనందంతో సిద్ధయ్యకు నమస్కారం చేసి వెళ్ళాడు దేశోద్ధారకమూర్తి. పార్టీ టిక్కెట్టు వచ్చినట్టూ, ఎం.ఎల్.ఏ.గా నెగ్గినట్టూ, మంత్రి అయినట్టూ ఆ రాత్రి కలలుగన్నాడు మూడు దశాబ్దాల వయస్సు నిండిన, అప్పుడే రాజకీయ కీకారణ్యంలో రంగప్రవేశం చేయబోతూన్న దేశోద్ధారకమూర్తి.

అధికారపార్టీ తరపున మళ్ళీ సిద్ధయ్యకే టిక్కెట్టు లభించింది.

దేశోద్ధారకమూర్తి చేసిన ప్రయత్నాలన్నీ ఏమాత్రం ఫలించలేదు. పైపెచ్చు ప్రయత్నాలకు పదివేలు ఖర్చయింది.

దేశోద్ధారకమూర్తి మహోదగ్ర ఆగ్రహావేశపరుడై సిద్ధయ్య దగ్గరికొచ్చాడు.

"బాబాయ్! ఎంత మోసంచేశావ్?"

"మోసమా? నేనా!"

"అవును. నిలబడనన్నావు. పలుకుబడంతా వుపయోగించి పార్టీ టిక్కెట్టు తెచ్చుకున్నావు. నామినేషన్ వేశావు."

"పార్టీకి నేను విధేయుడ్ని. ప్రజల నాడి పరీక్షించాను, మళ్ళీ నన్ను

ఎం.ఎల్.ఏగా ఈ నియోజకవర్గం ప్రజలు కోరుకుంటున్నారు. ప్రజాసేవకులు ఎప్పుడూ ప్రజల అభీష్టాన్ని మన్నించాలి బాబూ!" అన్నాడు సిద్ధయ్య హిమాలయ పర్వతంమీద మంచువర్షం కురిసినంత గంభీరంగా.

దేశోద్ధారకమూర్తి అరికాళ్ళలోని రక్తప్రవరణ నడినెత్తిమీదకు చిమ్మింది. కోపావేశంతో నోరు పెద్దదిచేశాడు.

"అంతా అబద్ధం. పచ్చి అబద్ధం అధికారదాహంతో అడ్డమైనదార్లు తొక్కి పార్టీటిక్కెట్టు సంపాయించావు. నాకు తెల్సు పార్టీ అధ్యక్షుడికి లంచంగా నువ్వు ఎన్ని లక్షలిచ్చిందీ! నీకు పోటీగా నిలబడి నిన్ను ఓడించకపోతే, నేను పేరే మార్చుకుంటాను. మూడుసార్లుమంచీ ఎం.ఎల్.ఏ.గా నువ్వు ఎన్ని అవినీతి పనులు చేసి, ఎన్ని మర్డర్లు చేయించి, ఎంతమంది దగ్గర వేలకొద్దీ లంచాలు పుచ్చుకొని ఎన్ని కానిపనులు చేయించిందీ నేను ప్రజలకు చాటిచెబుతాను. నిన్ను చిత్తుగా ఓడిస్తాను."

"అబ్బాయ్! ఆవేశంతో ఆలోచనకు సున్నా చుడుతున్నావు. అధికారంలో వున్న రాజకీయనాయకుడు ఒక రకంగా పుట్టలోని పాములాంటివాడు. పుట్టలో పాము ఉన్నదంటే పాలుపోస్తారు; పళ్ళూ, ఫలారాలూ పెడతారు; పూజలు చేస్తారు. ఆ పుట్టదాటి పాము బయటికొచ్చిందంటే పదిమందీ కర్రలతో దానివెంట పడతారు. పుట్టలోని పాముకీ, పుట్టవొదిలిన పాముకీ 'డిఫరెన్స్' తెల్సుకోకపోతే, నీకు రాజకీయాల్లో అక్షరాభ్యాసం జరగలేదన్నమాటే! ఏమంటావు! మనిషి నెత్తుర్ను రుచిమాసిన పులి మామూలు జంతువుల జోలికి పోదు. అధికారపార్టీకి ప్రజాప్రతినిధి అయ్యే అవకాశం వొచ్చిన వ్యక్తి, ఆ అవకాశాన్ని ఎందుకు జారవిడ్చుకుంటాడు? లేనిపోని ఆవేశాలకు పోక, నాతో ఎన్నికల్లో పోటీచేసి ఉన్న పదెకరాల పొలాన్ని ఎందుకు పోకడ పెట్టుకుంటావు?"

దేశోద్ధారకమూర్తికి కాళ్ళకింద భూమి గజగజలాడినట్లయింది.

ఎం.ఎల్.ఏకు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్‌ఫారం వేద్దామని ముప్పై ఆరు గంటలపాటు తీవ్రంగా ఆలోచించి, ఫారం వేయడం విరమించుకున్నాడు దేశోద్ధారకమూర్తి.

*నరమాంసాన్ని భక్షించే పులి ఆకలివంటిది అధికార దాహం.*